తెలంగాణ ఇసుక వద్దు.. ఏపీ ఇసుకే ముద్దు!

నూతన ఇసుక పాలసీ ఆంక్షల ఫలితం

పొరుగు రాష్ట్రం నుంచి భారీగా ఇసుక రవాణా

హైదరాబాద్, జూన్ 22(నమస్తే తెలంగాణ): పొరుగు రాష్ట్రం ఏపీ ఇసుకను ఉచితంగా ఇస్తుంటే మన రాష్ట్రం మాత్రం నూతన ఇసుక పాలసీ పేరుతో సజావుగా సాగుతున్న ప్రక్రియను మరింత జటిలం చేసింది. ఫలితంగా ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అటు రవాణాదారులకు కూడా గిట్టుబాటుకాని పరిస్థితి ఏర్పడింది. దీంతో లారీ యజమానులు మరో గత్యంతరం లేక పొరుగు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నారు. నిర్మాణ రంగానికి ఇసుక ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవరం లేదు. నిత్యం వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కానీ, భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే నెపంతో కాంగ్రెస్ సర్కారు నూతన ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. దీంతో గతంలో టన్ను ఇసుక రూ. 1400-1500 ఉండగా, నూతన పాలసీ పుణ్యమా అని ఇసుక ధరలు భారీగా పెరిగిపోయాయి. ఒక దశలో ఇసుక ధరలు టన్నుకు రూ. 2000-

2300 వరకు ఎగబాకాయి. అంతేకాదు, ఇసుక రీచ్‌ల వద్ద రకరకాల ఆంక్షలు విధించడం, లోడింగ్‌లో జాప్యం చేస్తుండటంతో ఇసుకకు కృత్రిమ కొరత ఏర్పడింది. ఇసుక లారీలకు పోటీగా ప్రభుత్వమే ఇసుకను విక్రయించేందుకు హైదరాబాద్‌లో శాండ్ బజార్లను ఏర్పాటుచేసి అధికారికంగానే ఇసుక ధరను రూ. 1600-1800గా ఖరారు చేసింది. జీఎస్‌టీ, రవాణా, లేబర్ చార్జీలు దీనికి అదనం. ఈ శాండ్ బజార్లలో నాసిరకం ఇసుకను విక్రయిస్తుండటంతో నిర్మాణదారులు ప్రైవేటు అడ్డాల నుంచే ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణలో పరిస్థితి ఇలా వుంటే, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ మాత్రం గతంలో ఉన్న ఇసుక పాలసీని రద్దు చేసి ఉచితంగా ఇసుకను అందిస్తున్నది. దీంతో లారీల యజమానులు కోదాడ మీదుగా ఏపీ నుంచి ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రోజూ వందల సంఖ్యలో నగరానికి ఏపీ ఇసుక వస్తుండడంతో ధరలు కొంత స్థిరంగా ఉన్నాయని నిర్మాణదారులు చెప్తున్నారు. ఏపీ నుంచి ఇసుక తేస్తేనే తమకు గిట్టుబాటు అవుతున్నదని ఇసుక లారీల యజమానులు చెప్తున్నారు. మన రాష్ట్రంలో టన్ను ఇసుకకు రూ. 400 వరకూ టీజీఎండీసీకి చెల్లించాల్సి వస్తున్నదని, లోడింగ్‌కు రెండు రోజుల సమయం పడుతున్నదని పేర్కొన్నారు. జాప్యం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయని, అంతేకాకుండా ఓవర్ లోడింగ్ పేరుతో రకరకాల ఆంక్షలు విధిస్తున్నారని, ఎక్కువ లోడింగ్ ఉన్నా జరిమానాలు విధిస్తున్నారని వాపోయారు. ఏపీ నుంచి ఇసుకను తెస్తే దూరం కొంత పెరిగినప్పటికీ ఎటువంటి ఇబ్బందులు ఉండడంలేదని, అక్కడ వెంటనే లోడింగ్ అవుతున్నదని చెప్తున్నారు. దీనివల్ల శాండ్ బజార్లలో ప్రభుత్వం విక్రయిస్తున్న ధరకే తాము నాణ్యమైన ఇసుకను వినియోగదారుల ఇంటి వద్దకు చేర్చగలుగుతున్నట్టు వివరించారు.

ఆంక్షలు ఎత్తివేయాలి

రాష్ట్రంలోని ఇసుక రీచ్‌ల వద్ద లారీలపై ఆంక్షలను ఎత్తివేసి లోడింగ్ వెంటనే జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇసుక లారీల యజమానుల సంఘం విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా ఇసుక రీచ్‌ల వద్ద డ్రైవర్లు, సిబ్బంది కోసం తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏపీ మాదిరిగా ఇసుక ఉచితంగా ఇవ్వకున్నా, తనిఖీల పేరుతో లారీ యజమానులను ఇబ్బందులపాల చేయవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఊడిపడిన ఫ్యాన్

దవాఖానలో ఊడిపడిన సీలింగ్ ఫ్యాన్

- రెండు రోజుల పసికందుకు గాయాలు
- త్రుటిలో తప్పిన ప్రమాదం

గుడిహత్నూర్, జూన్ 22 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగల బాలింతల గదిలో ఆదివారం ప్రమాదవశత్తు సీలింగ్ ఫ్యాన్ ఊడిపడింది. పక్కనే ఉన్న రెండు రోజుల పసికందు తలకు గాయమైంది. రెండు రోజుల క్రితం కొద్దుగూడ గ్రామానికి చెందిన మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. దవాఖానలోని బెడ్‌పై తల్లీపాప పడుకొని ఉండగా ఈ ఘటన జరిగింది. పసికందుకు గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనతో దవాఖానలోని రోగులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

ఫ్యాన్ ఊడిపడినప్పుడు పక్కనే ఉన్న రెండు రోజుల పసికందు

యువతలో 'పోషక లోపం'

- కలవరపెడుతున్న ఊబకాయం
- 29% మందిలో పోషక లోపం.. 19% మందిలో ఊబకాయం
- 68% యువతలో మోస్తరు ఒత్తిడి
- ప్రతి 10 మందిలో ఇద్దరికీ లక్షణాలు ఉన్నట్టు వెల్లడి
- 'యంగ్ లైవ్స్ సర్వే-2023'లో పలు ఆందోళనకర విషయాలు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో యువత 'డబుల్ బర్డెన్ ఆఫ్ మాల్‌న్యూట్రిషన్'తో బాధపడుతున్నది. ఓవైపు యువతలో ఊబకాయం పెరుగుతుండగా.. పోషకాహార లోపం తీవ్రంగా కనిపిస్తున్నది. దీన్నే వైద్య నిపుణులు 'డబుల్ బర్డెన్ ఆఫ్ మాల్‌న్యూట్రిషన్' అంటున్నారు. 'యంగ్ లైవ్స్ సర్వే-2023' సర్వే ఆందోళనకర విషయాలు వెల్లడించింది. 22 ఏండ్ల యువతలో 19% మంది అధిక బరువుతో బాధపడుతుండగా.. 29% మంది తక్కువ

బరువుతో బాధపడుతున్నారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో స్థూలకాయం ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు వెల్లడించాయి. పురుషుల్లో 14% మంది స్థూలకాయంతో బాధపడుతుండగా.. మహిళలు 18.8%గా ఉన్నారు. సామాజిక, ఆర్థిక ప్రతికూలతలు సైతం యువత శారీరక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నట్టు సర్వే అభిప్రాయపడింది. చదువుకున్న తల్లులు ఉన్న కుటుంబాల్లో ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉన్నట్టు సర్వే వెల్లడించింది.

యువతలో ఆందోళనకరంగా 'ఒత్తిడి'

రాష్ట్రంలో 2023 నాటికి 68% యువత మోస్తరు స్థాయి ఒత్తిడికి లోనవుతున్నట్టు సర్వే పేర్కొంది. ప్రతి 10 మందిలో ఇద్దరికీ ఈ లక్షణాలు ఉన్నట్టు తెలిపింది. అదే సమయంలో 15% మంది తేలికపాటి నిరాశ, ఆందోళన లక్షణాలు కలిగి ఉన్నట్టు స్పష్టంచేసింది. పట్టణ యువతలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు సర్వే పేర్కొంది. కొవిడ్ సమయంలో 19% ఉన్న ఈ సమస్య.. 2023 నాటికి 15 శాతానికి తగ్గినట్టు రిపోర్టు వెల్లడించింది. మహిళల కంటే పురుషులు తక్కువ మానసిక సమస్యలకు గురవుతున్నట్టు గణాంకాలు తెలిపాయి. కొవిడ్ తర్వాత ఆరోగ్యకరంగా ఉండాలనే ధృఢ సంకల్పం ప్రజల్లో పెరిగింది. దేశవ్యాప్తంగా అగస్టు 2023 నుంచి జనవరి 2024 వరకు మొత్తం 948 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. ఇందులో యువకులు 641 మంది, 307 మంది పెద్దలు ఉన్నారు. 'డబుల్ బర్డెన్ మాల్ న్యూట్రిషన్', మోస్తరు స్థాయి ఒత్తిడిపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యారోగ్య నిపుణులు కోరుతున్నారు.

425కిలోల క్లోరల్ హైడ్రేట్ స్వాధీనం

ఐదుగురి అరెస్టు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): అక్రమంగా 425 కిలోల క్లోరల్ హైడ్రేట్, 1.115 కిలోల అల్ఫాజోలంను తరలిస్తున్న ఐదుగురిని తెలంగాణ నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నారు. డీటీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర థానే జిల్లా గణేశ్‌పురి మండలం, నింబవాలి గ్రామంలో తయారు చేసిన క్లోరల్ హైడ్రేట్, అల్ఫాజోలం డ్రగ్‌లను రామగౌడ్ (45), బుర్ర రమేశ్ (36), కొట్టగిరి రాజం (59), ఎల్లందుల శ్రీనివాస్ (44), బుర్ర రాజశేఖర్ (34)లు అక్రమంగా తరలిస్తుండగా తెలంగాణ నార్కోటిక్, నిర్మల్ ఎక్సైజ్ పోలీసులు పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన మత్తు పదార్థాల విలువ రూ. 52 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా కొనసాగించిన ఎస్పీ రూపేశ్, డీఎస్పీ హరీశ్ చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ పీ రమేశ్‌రెడ్డి, నిర్మల్ ఎక్సైజ్ పోలీసులను సందీప్ శాండిల్య అభినందించారు.

11ఫ్లోర్‌లలో హాస్టల్.. 12ఫ్లోర్‌లలో క్లాస్‌రూమ్స్

- మహిళా వర్సిటీ భవనాలకు ఈ నెలలోనే టెండర్లు
- రెండున్నరేండ్లల్లో పూర్తి చేయాలని టార్గెట్
- వర్సిటీ విభజనకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నెలకొల్పిన చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ అభివృద్ధికి రంగం సిద్ధమయ్యింది. 11అంతస్థుల్లో హాస్టల్, 12 అంతస్థుల్లో క్లాస్‌రూమ్ కాంప్లెక్స్(అకాడమిక్ బ్లాక్)ను నిర్మించనున్నారు. ఇవే కాకుండా ప్రత్యేకంగా కిచెన్, రెండువేల మంది సామర్థ్యం గల ఆడిటోరియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, లైబ్రరీని సైతం నిర్మించనున్నారు. వర్సిటీ చుట్టూ గ్రిల్స్ నిర్మిస్తారు. కోఠి మహిళా కాలేజీని మహిళా వర్సిటీగా అప్‌గ్రేడ్‌చేయగా... ఇటీవలే యూజీసీ గుర్తింపు ఇచ్చింది. రూ. 500 కోట్ల నిధులు మంజూరుచేసింది. ఈ నిధులతో అకాడమిక్, హాస్టళ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

ఆప్షన్ల ప్రకారమే కేటాయింపు..

వర్సిటీలో ప్రస్తుతం 18 మంది రెగ్యులర్ ఆచార్యులున్నారు. వీరిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు కాగా, 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లే. వీరితోపాటు మరో 42మంది బోధనేతర సిబ్బంది ఉన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 400కుపైగా ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. వీరంతా ఉస్మానియా యూనివర్సిటీ కిందే ఉన్నారు. ఉస్మానియా వర్సిటీ నుంచి కొత్త వర్సిటీ ఏర్పడటంతో బోధన, బోధనేతర సిబ్బందిని విభజించాల్సి ఉంది. ఉద్యోగుల విభజనలో భాగంగా అందరికీ ఆప్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఉస్మానియా, మహిళా వర్సిటీల్లో ఏదో ఒకదాంట్లో కొనసాగే ఆప్షన్లు ఇస్తారు. ఆయా ఆప్షన్ల ప్రకారమే విభజిస్తారు. ఆప్షన్లు ఇచ్చినా.. ఉద్యోగులను విభజించినా మహిళా వర్సిటీలో కొత్త రిక్రూట్‌మెంట్ పూర్తయ్యే వరకు అంతా మహిళా వర్సిటీలోనే పని చేయాల్సి ఉంటుందని ఇటీవలే ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్ తెలిపారు.

రెండున్నరేండ్లల్లో పూర్తి..

హైదరాబాద్ నడిబొడ్డున కోఠి లోని వర్సిటీకి 41.77 ఎకరాల స్థలం ఉంది. యూజీ, పీజీ కలుపుకుంటే మొత్తం 31 డిపార్ట్‌మెంట్లున్నాయి. ఈ వర్సిటీలో మొత్తం 72కోర్సులు నిర్వహిస్తుండగా, ఈ వర్సిటీలో 7వేల మంది విద్యార్థులున్నారు. హాస్టళ్లు, క్లాస్‌రూమ్ కాంప్లెక్స్ నిర్మాణ బాధ్యతలను టీజీఈడబ్ల్యూఐడీసీకి అప్పగించారు. ప్రస్తుతం టెండర్ల దశలో ఉంది. త్వరగా టెండర్లను పూర్తి చేసి.. జూలై రెండోవారంలో పనులు ప్రారంభించాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. రెండున్నరేండ్లల్లో హాస్టళ్లు, క్లాస్‌రూమ్ కాంప్లెక్స్‌ను పూర్తిచేయాలని గడువు పెట్టుకున్నారు. దీంతో 2027 డిసెంబర్ కల్లా కొత్త భవనాలు అందుబాటులోకి వస్తాయి.

స్టాక్‌యార్డుల్లో ఇసుక నిల్వ నిల్!

- ముందుచూపు లేని టీజీఎండీసీ
- తుపానులొస్తే ఇసుకకు కొరతనే
- ధరలు భారీగా పెరిగే అవకాశం

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇసుక కొరత ఏర్పడింది. ఇసుక లేక స్టాక్‌యార్డ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వర్షాలు తీవ్రమైతే మరిన్ని ఇబ్బందులు తప్పేలాలేవని నిర్మాణరంగంలో ఆందోళన వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలో ఏటా సగటున 170-175 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగం జరుగుతుంది. ఇసుకపై ప్రభుత్వానికి సంవత్సరానికి దాదాపు రూ.700 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. నదుల్లో వరద, రవాణా ఇబ్బందుల కారణంగా వర్షాకాలంలో ఇసుక సరఫరా తగ్గుతుంది. అందుకే వేసవిలోనే ఇసుక రీచ్‌లకు వెళ్లే రోడ్ల మరమ్మతులు పూర్తిచేసి, స్టాక్‌యార్డ్‌ల వద్ద ఇసుకను నిల్వలు ఉంచుతారు. కానీ ప్రభుత్వం, టీజీఎండీసీ అధికారులకు ముందుచూపు లేకపోవడమే ప్రస్తుతం కొరత ఏర్పడిందని నిర్మాణ రంగసంస్థ ప్రతినిధులు మండిపడుతున్నారు.

సర్కారు బజార్లతోనే బేజారు

ప్రభుత్వం ఇసుక బజార్లు ఏర్పాటు చేసి టన్ను దొడ్డు ఇసుక ధర రూ.1600, సన్న ఇసుక రూ.1800గా నిర్ణయించింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో ఆ ధర కాస్త రూ.2000కు పైగా పలుకుతున్నది. ప్రస్తుత కొరత, రానున్న సంక్షోభంతో ధరలు మరింత పెరిగే అవకాశముందని ఇసుక వ్యాపారులు చెప్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక రవాణా సులభంగా, ధరలు అదుపులో ఉండడంతో నిర్మాణరంగం వేగంగా అభివృద్ధి చెందిందని, ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చిందని చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచితమైన ఆంక్షలతోనే అమ్మకాలు పడిపోయాయని మండిపడుతున్నారు.

ఇసుక అమ్మకం... ప్రభుత్వ ఆదాయం

సంవత్సరం	ఇసుక విక్రయాలు (లక్షల మెట్రిక్ టన్నుల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)
2014-15	5.41	19.12
2015-16	105.5	374.99
2016-17	120.88	456.46
2017-18	196.06	678.33
2018-19	222.28	886.43
2019-20	198.93	792.8
2020-21	194.61	783.75
2021-22	198.35	802.11
2022-23	186.35	757.32
2023-24	163.82	673.55
2024-25	167.55	686.45



రహదారుల అప్‌గ్రేడ్ ఎప్పుడో?

- బీఆర్ఎస్ హయాంలోనే కేంద్రానికి ప్రతిపాదనలు
- జాతీయ రహదారుల గుర్తింపు కోసం కేంద్రానికి విజ్ఞాపనలు
- 16 ప్రధానమైన రహదారులు, 1617కిలోమీటర్లు..
- కేంద్ర ప్రభుత్వం వద్దనే ఏండ్ల తరబడి ప్రతిపాదనలు పెండింగ్
- మోదీ సర్కారు నిర్ణయం కోసం అధికారుల నిరీక్షణ

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 1617 కిలోమీటర్ల పొడవైన 16 ప్రధాన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు, ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఇండస్ట్రియల్ కారిడార్లను కలుపుతున్న రహదారులను అప్‌గ్రేడ్ చేయాల్సిన ఆవశ్యకతను గతంలోనే బీఆర్ఎస్ సర్కారు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు.. కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు సమర్పించారు. కానీ ఏండ్లు గడిచినా వినతిపత్రాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తెలంగాణపై మోదీ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తున్నదని రాజకీయవర్గాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ రోడ్లు బాగుపడొద్దా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కారు రోడ్లను అద్భుతంగా విస్తరించింది. అలాగే రాష్ట్రంలోని 16 ప్రధాన రాష్ట్ర రహదారులను నాలుగు లేన్ల జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ఆయా రహదారుల ప్రాధాన్యతను కేంద్రానికి పలుదఫాలుగా వివరించింది. నరేంద్రమోదీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదు. కేంద్రం నిర్ణయం కోసమే నిరీక్షిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వంలోని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెప్తున్నాయి. మోదీ సర్కారు పచ్చజెండా ఊపితే 1600 కిలోమీటర్ల రాష్ట్ర రహదారుల రూపురేఖలు మారుతాయని, లేదంటే ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆర్‌అండ్‌బీ అధికారులు వాపోతున్నారు.

అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదిత రోడ్లు

మార్గం	దూరం(కి.మీ)
జగిత్యాల-కాటారం	130
దిండి-నల్లగొండ	100
భువనగిరి-చిట్యాల	44
చౌటుప్పల్-సంగారెడ్డి	182
మరికల్-రామసముద్రం	63
వనపర్తి-మంత్రాలయం	110
మన్నెగూడ-బీదర్	134
కరీంనగర్-పిట్లం	165
ఎర్రవల్లి క్రాస్‌రోడ్-రాయచూర్	67
కొత్తపల్లి-దుద్దెడ	75
సారపాక-పటూరునాగారం	93
దుద్దెడ-రాయగిరి క్రాస్‌రోడ్	63
జగ్గయ్యపేట-కొత్తగూడెం	100
సిరిసిల్ల-కోరుట్ల	65
భూత్పూర్-సిరిగిరిపాడు	166
కరీంనగర్-రాయపట్నం	60
మొత్తం	1617

వైఎస్ జగన్ కారు ఢీకొని వ్యక్తి మృతి?

పోలీసుల అదుపులో జగన్ కారు డ్రైవర్

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారు ఢీకొని సింగయ్య అనే వ్యక్తి మృతి చెందినట్టు సోషల్ మీడియాలో వీడియో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జగన్ కారు డ్రైవర్‌ను నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు మీడియా వర్గాలు వెల్లడించాయి. అలాగే మాజీ సీఎం జగన్, కారు డ్రైవర్ రమణారెడ్డి, పీఏ నాగేశ్వర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు షేర్నీ నాని, రజినిలపై కేసు నమోదు చేయగా, ఏ1గా డ్రైవర్, ఏ2గా జగన్‌ను కేసులో చేర్చినట్టు తెలిసింది. జగన్ పర్యటనలో ప్రమాదంపై కూటమి ప్రభుత్వం కావాలనే కుట్ర చేస్తున్నదని వైసీపీ 'ఎక్స్' వేదికగా ఆరోపించింది. టీడీపీ రాజకీయ లబ్ధి కోసమే ఈ ప్రమాదాన్ని వాడుకుంటున్నదని మండిపడింది.

ఆయాలకు ఐదునెలలుగా వేతనాలు బంద్

- బీఆర్ఎస్ తెచ్చిన జీవో 60కి కాంగ్రెస్ సర్కారు తూట్లు
- నిరుడు ప్రతి నెలా సమయానికి జీతాలేసిన కేసీఆర్ సర్కార్
- జీతాల కోసం శిశు విహార్ సిబ్బంది ఎదురుచూపులు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని శిశువిహార్ ముందు నిరసన తెలుపుతున్న సిబ్బంది (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్22 (నమస్తే తెలంగాణ): అనాథపిల్లల ఆలనాపాలన చూసే ఆయాలు జీతాలిప్పించండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకుంటున్నారు. ఐదు నెలలుగా వేతనాలందక వారు అష్టకష్టాలు పడుతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతినెలా పడే జీతాలు ఇప్పుడు ఐదు నెలలుగా పడటం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంటి అద్దెలు చెల్లించడంతోపాటు ఇల్లు గడిచేందుకు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నట్టు చెప్తూ వాపోతున్నారు. హైదరాబాద్‌లోని అనాథ పిల్లల సంరక్షణ కేంద్రం శిశు విహార్‌లో సుమారు 200 మంది పిల్లలకు 130మందికి పైగా ఆయాలు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకమై నిత్యం సేవలందిస్తున్నారు. పనిచేసే సిబ్బందిలో ఒంటరి మహిళలు, వితంతువులే అధికంగా ఉన్నారు. ప్రతి నెలా జీతం వస్తేగానీ కుటుంబం గడవని పరిస్థితి వాళ్లది. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచి నేటి వరకు వేతనాలు అందకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. హరీశ్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే జీవో 60 అమలు చేయించి ఆయాలకు రూ.15,600 వేతనం ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన జీవోకు కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తున్నది. జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. సిబ్బంది వేతనాల్లోంచి ఈఎస్ఐ, పీఎఫ్‌లు సైతం కట్టకుండా కాంట్రాక్టర్లు మోసగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయాలు వారాంతపు సెలవులు తీసుకుంటే సెలవు పేరుతో ఆ రోజు జీతం కట్ చేస్తున్నట్టు తెలిసింది

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

శిశు విహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలంటూ అధికారులందరికీ వినతి పత్రాలిచ్చాం. అనాథ పిల్లలకు సేలందించే వారి జీతాలు ఆపడం దుర్మార్గం. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు ఇవ్వడంతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి.

-రాపర్తి అశోక్, శిశు విహార్ సీఐటీయూ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్

జీతాలు ఇవ్వండి మహాప్రభో!

- అరిగోస పడుతున్న డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఎస్జీటీల అరిగోస
- ఫిబ్రవరిలో ఉద్యోగాలిచ్చి జీతాల పంపిణీలో తీవ్ర జాప్యం
- బడ్జెట్ విడుదలై 20 రోజులైనా పట్టింపులేని అధికారులు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): దేవుడు వరమిచ్చినా, పూజారి కరుణించలేదన్నట్టుగా విద్యాశాఖ వ్యవహారం కనిపిస్తున్నది. 2008 డీఎస్సీలో నష్టపోయిన బాధితులకు కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా ఉద్యోగాలు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 1,225 మంది అభ్యర్థులు ఫిబ్రవరి 15నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగున్నర నెలలు దాటినా ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదు. దీంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాధితులు, ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు ఆర్థికశాఖ గత నెల 19న దాదాపు రూ.52 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ గత నెల 31న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను ఆదేశించింది. అప్పటి నుంచి 21 రోజులు గడుస్తున్నా వేతనాల పంపిణీపై స్పష్టత లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2008 డీఎస్సీ కాం టాక్ట్ టీచర్ల వేతనాల బిల్లులు చేయాలంటూ కొన్ని జిల్లాల్లో డీఈవోలు ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. కానీ బిల్లుల్లో స్పష్టత లేకపోవడంతో ఎంఈవోలు అయోమయంలో ఉన్నారు.

తనిఖీలకు వెళ్లిన కానిస్టేబుల్‌కు గుండెపోటు

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

జీడిమెట్ల, జూన్ 22 : విధి నిర్వహణలో భాగంగా తనిఖీలకు వెళ్లిన ఎస్వోటీ కానిస్టేబుల్ గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నానికి చెందిన ప్రవీణ్ కుమార్(38) చింతల్ బాపునగర్ శ్రీసాయి భవన్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటూ.. బాలానగర్ జోన్ ఎస్వోటీ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. శనివారం కుత్బుల్లాపూర్ ఎన్టీఆర్‌నగర్‌లో గంజాయి తనిఖీలకు వెళ్లగా.. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని చింతల్‌లోని ఓ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. భార్య జానకీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాపునగర్‌లో ఆదివారం కానిస్టేబుల్ ప్రవీణ్ అంత్యక్రియలను పోలీస్ లాంచనాలతో నిర్వహించారు. బాలానగర్ ఎస్వోటీ డీసీపీతోపాటు పోలీస్ అధికారులు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

ఎస్వోటీ కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్ (ఫైల్)

- గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన రఘురాం

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అత్యధిక అవగాహన తరగతులు నిర్వహించిన రఘురాం గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడు. దీంతో గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం జరిగిన సదస్సులో గవర్నర్ జిష